
సాక్షి పల్నాడు

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



సీతారామలక్ష్మణులకు వెండి వస్త్రాలు

మాచర్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న కోదండ రామాలయంలో రామలక్ష్మణులకు వెండి పంచెలు, సీతమ్మకి వెండి చీర సమర్పించారు. ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 7508 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 340 క్యూసెక్కులు వదిలారు.



గ్రామదేవతలకు బోనాలు సమర్పణ

దాచేపల్లి: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో అంకమ్మ తల్లి, గంగమ్మ తల్లికి గురువారం బోనాలు సమర్పించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

మాచర్ల కోర్టు జడ్జిగా ప్రశాంత్ బాధ్యతల స్వీకారం



మాచర్ల: మాచర్ల సివిల్ జడ్జి కోర్టులో అడిషినల్ క్రిమినల్ కోర్టు జడ్జిగా పి ప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఆయన మాచర్ల సివిల్ జడ్జి కోర్టులో అడిషినల్ క్రిమినల్ కోర్టు జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. మాచర్ల సివిల్ క్రిమినల్ జడ్జిలుగా రెండు పోస్టులున్నాయి. కొన్ని రోజులుగా క్రిమినల్ కోర్టు జడ్జి పోస్టు ఖాళీగా ఉండగా శ్రీనివాస్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా జడ్జిగా ఎంపికైన పి ప్రశాంత్‌ను మాచర్ల క్రిమినల్ కోర్టు జడ్జిగా నియమించటంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వహిస్తారు. తిరుపతికి చెందిన ప్రశాంత్ ఇటీవల సివిల్ న్యాయమూర్తుల పరీక్షల్లో న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఆయన మాచర్లలో జడ్జిగా ఫస్ట్ పోస్టింగ్‌లో చేరారు. ఈయనను సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్, పీపీ, ఏజీపీ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పలువురు అభినందించారు.

ఈవీఎంల పరిశీలన




ఫిరంగిపురం: మండలంలోని రేపూడి మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా ఇంచార్జి ఆర్డీవో గంగరాజు గురువారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. మరమ్మతులకు గురైన 39 వీవీ ప్యాడ్స్‌ను కంటైనర్‌లో బెంగుళూరులోని బెల్ కంపెనీకి పంపిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట గుంటూరు తహసీల్దార్ నగేష్, ఇంచార్జి తహసీల్దార్ రాజా రమేష్ మోహన్, నియోజకవర్గాల రెవెన్యూ సిబ్బంది, నాయకులు ఎం.శివరామిరెడ్డి, ఆరె పున్నారెడ్డి, పి.చిన్న, రామమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సుగాలీ కాలనీ జెడ్పీ పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు



సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లాలోని పాఠశాలలకు సంబంధించి నిర్వహించిన స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీలో నాలుగో స్థానం సత్తెనపల్లి సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దక్కించుకుంది. జిల్లా కలెక్టర్ పి.అరుణబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఈవో ఎం.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గురువారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రామనాథం వాసు, పాఠశాల పీడీలు ఎస్‌కె.ఎండీ.రియాజ్, సుధారాణి, పీఈటీ నరసింహారావులు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ క్రీడా ప్రతిభ అవార్డును అందుకున్నారు.

యార్డుకు 56,735 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 56,735 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 55,261 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,347 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



డాక్టర్లకు రక్షణ కల్పిస్తేనే పేషెంట్లకు వైద్యం

కోలకతా సంఘటన చాలా బాధాకరం. దీనికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టుచేసి వారికి సరైన శిక్ష విధించాలి. కుల, మత, ప్రాంతాలకతీతంగా రోగులకు సేవలు అందజేసే డాక్టర్లపై అమానుష దాడులు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయి. దీనికి కారణం సక్రమంగా చట్టాలు అమలుకాకపోవటమే. ప్రభుత్వ హాస్పిటళ్లలో పోలీసు అవుట్ పోస్టు, సీసీ కెమెరాలు పర్యవేక్షణ తప్పనిసరి చేయాలి. వారికి రక్షణ ఉంటేనే సరైన వైద్యం అందివగలుగుతాం. అప్పుడే విధుల్లో ఉన్న డాక్టర్లకు కొంతమేర రక్షణ.

-డాక్టర్ కె.చెన్నారెడ్డి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, నరసరావుపేట





ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కావాలి

రాత్రి సమయంలో విధులు నిర్వహించే చోట మహిళలకు ప్రత్యేక భద్రతా చర్యలు అవసరం. కోల్‌కతా సంఘటన ఈ అవసరాన్ని గుర్తుచేస్తోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో ఏర్పాట్లకు కావాల్సిన నిధులు ప్రభుత్వం సమకూర్చాలి. ప్రభుత్వ వైద్యశాలల్లో పోలీసుల పహారా, సీసీ కెమెరాల నిఘా 24గంటలూ ఉండాలి. డాక్టర్లకు రక్షణ ఉంటేనే విధులు సక్రమంగా నిర్వహించగలుగుతారు.

-డాక్టర్ గజ్జల ప్రియాంక, ఎనస్తీషియా, క్రిటికల్ కేర్, నరసరావుపేట

ముమ్మరంగా ఇంటింటి సర్వే

- ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ
- జిల్లాలో ప్రారంభమైన ప్రీ రివిజన్ యాక్టివిటీ
- అక్టోబర్ 18 వరకు పరిశీలన
- 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా అర్హులు
- 2025 జనవరి 6వ తేదీ తుది ఓటర్ల జాబితా విడుదల



కంటెపూడిలో ఇంటింటి ఓటర్ల సర్వేలో బీఎల్ఓ(ఫైల్)

సత్తెనపల్లి: ఇటీవల సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత మరోమారు ఓటరు నమోదుపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఈ ఏడాది సంక్షిప్త ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. మే నెలలో జరిగిన ప్రధాన ఎన్నికలకు వారం రోజుల ముందు ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితా ప్రకటించింది. అప్పుడు జిల్లాలో మొత్తం ఓటర్లు 17,34858 మంది ఉండగా, ఇందులో మహిళలు 8,88,159 మంది, పురుషులు 8,46,508 మంది, థర్డ్‌జెండర్స్ 191 మంది ఉన్నట్లు గుర్తించారు. అర్హుల్లో కొంతమంది సకాలంలో ఓటర్లుగా నమోదు కాకపోవడంతో ఈ ఎన్నికల్లో ఓటు వేసే హక్కును కోల్పోయారు. ఏటా ఓటర్ల నమోదు చేపట్టి అర్హుల చేరిక, అనర్హుల తొలగింపు కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం చేపడుతుంది. ఇప్పటికే దీనికి సంబంధించి అధికారులు సమీక్ష జరిపారు. ఈ ఏడాదికి సంబంధించి ప్రస్తుతం బూత్ స్థాయి ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా వీరంతా ఇంటింటికి వెళ్లి జాబితాలో ఉన్న వివరాల ప్రకారం సర్వే చేస్తున్నారు. ఓటరు జాబితాలో ఉన్న చిరునామాలో ఉంటున్నారా? బదిలీ చేయాలా? పేర్లు, చిరునామాలు సరిగానే ఉన్నాయా? సవరణ చేయాలా? ఫొటోలు బాగున్నాయా? లేక ఏమైనా మార్పులు కోరుతున్నారా? 2025 జనవరి ఒకటికి 18 ఏళ్లు వచ్చే యువత ఉన్నారా? ఇప్పటికే 18 ఏళ్లు వచ్చి ఓటరుగా నమోదు కాలేదా? ఇలాంటి వివరాలను నమోదు చేయనున్నారు. దీంతోపాటు పోలింగ్ కేంద్రాల పరిస్థితిని నమోదు చేయనున్నారు. ఇందుకోసం బీఎల్ఓ యాప్ రూపొందించి అందులో పై అంశాలను నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్స్	మొత్తం
పెదకూరపాడు	1,13,398	1,19,039	16	2,32,453
చిలకలూరిపేట	1,08,392	1,18,205	49	2,26,646
నరసరావుపేట	1,13,152	1,19,596	30	2,32,778
సత్తెనపల్లి	1,18,400	1,23,635	12	2,42,047
వినుకొండ	1,31,174	1,33,365	20	2,64,559
గురజాల	1,33,353	1,40,576	42	2,73,971
మాచర్ల	1,28,639	1,33,743	22	2,62,404
మొత్తం	8,46,508	8,88,159	191	17,34,858

అక్టోబర్ 18కి పూర్తి

జిల్లాలో పోలింగ్ కేంద్రాలను వంద శాతం సందర్శించడంతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1,500 మించకుండా ఉండాలి. పోలింగ్ కేంద్రం ఓటర్లకు రెండు కిలోమీటర్లు పైబడి ఉండ రాదు. ఇలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ స్పెషల్ సమ్మరీ రివిజన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 18 నాటికి ఈ కార్యక్రమం పూర్తి కావాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు ఫార్మేట్-1 నుంచి 8 వరకు సిద్ధం చేయాలి. ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ తయారు చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 29వ తేదీ సమగ్ర ఓటర్ల ముసాయిదా జాబితాను నియోజకవర్గ ఎన్నికల అధికారి విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 24వ తేదీ నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తి కావాలి. 2025 జనవరి 6వ తేదీ తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు.

పక్కాగా ఓటర్ల సవరణ



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లు జాబితా పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. పోలింగ్ కేంద్రాల్లోని ప్రతి ఇంటికి బీఎల్వోలు వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లు, ఫొటోలు, అడ్రస్ మార్పులతో పాటు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించాలని ఆదేశాలు జారీ చేసి ఫారం-6,7,8 స్వీకరించి నివేదిక తయారు చేయాలని సూచించాం. ప్రజలు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణను సద్వినియోగం చేసుకోవాలి.

-వి.మురళీకృష్ణ, ఆర్డీవో, సత్తెనపల్లి

విద్యార్థులు మాతృభాష ప్రాధాన్యతను గుర్తెరగాలి

ధ్యాన్‌చంద్, గిడుగు చిత్రపటాలకు నివాళులర్పించిన కలెక్టర్



నరసరావుపేట:మాతృభాష ప్రాధాన్యతను విద్యార్థులు అందరూ తెలుసుకోవాలని, క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మాతృభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవహారిక భాష అభివృద్ధి కోసం కృషి చేసిన గిడుగు రామ్మూర్తి, క్రీడల్లో భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ వ్యాపితం చేసిన మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. వారుచేసిన సేవలను స్మరించుకున్నారు. జిల్లాలో క్రీడా పురస్కారాలకు ఐదు పాఠశాలలు ఎంపిక కాగా, వాటిలో చిలకలూరిపేట ఎ.ఎం.జి.పాఠశాల (రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం), సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పసుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సుగాలి), శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ప్రతినిధులకు పురస్కారాలు అందించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సీహెచ్. కోటేశ్వరరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై కూటమి కక్ష

- ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, రేషన్ డీలర్ల తొలగింపు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా ముద్రవేసి తొలగించేందుకు యత్నం
- టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు



నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను, కుకింగ్ ఏజెన్సీలను, రేషన్ డీలర్లపై కక్ష కట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఉపాధి హామీ పనులను నిలిపివేసి, చేసిన పనులకు అధికారులు కనీసం కూలి డబ్బులు కూడా చెల్లించకపోగా వారి చేత బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. దాదాపు 18 ఏళ్ల నుంచి క్షేత్ర సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రస్తుతం రాజకీయ రంగు పులిమి తొలగించే ప్రయత్నాలు చేస్తుండడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో క్షేత్ర సహాయకులు ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకుల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో 74 గ్రామ పంచాయతీలు ఉండగా 71 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తించాల్సి ఉంది. 10 ఖాళీలు ఉండడంతో మొత్తం 61 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరినీ తొలగించి టీడీపీకి చెందిన సానుభూతిపరులను నియమించుకునేందుకు అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. నియోజకవర్గంలో 168 ప్రాథమిక, 18 ప్రాథమికోన్నత, 31 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 218 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. వీరిని ప్రస్తుతం బలవంతంగా తొలగించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. బలవంతంగా రాజీనామా చేయించాలని మండల విద్యాశాఖ అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి తేవడంతో ఆ మేరకు బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారు. నియోజకవర్గంలో 165 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటిలో 42 రెగ్యులర్ కాగా.. 123 తాత్కాలిక చౌక దుకాణాలు ఉన్నాయి. 123 తాత్కాలిక చౌక దుకాణాలను తక్షణమే రాజీనామా చేయించాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేయడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు వారిపై దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే చాలామంది రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోలేక రాజీనామా చేయగా మిగిలిన వారిని కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో లొంగని వారిని కేసులు రాస్తామని బెదిరిస్తున్నారు. తాము న్యాయంగా రేషన్ ఇస్తుంటే ఎలా కేసులు రాస్తారని కొందరు డీలర్లు ప్రశ్నించిన దాఖలాలు ఉన్నాయి. ఎక్కడ తప్పుడు కేసులు పెడతారోనని కొందరు డీలర్లు ఆందోళన చెందుతున్నారు. చౌకదుకాణం కోసం ధూళిపాళ్లలో టీడీపీ నాయకుల మధ్య గతంలో ఘర్షణ కూడా జరిగింది. తాను చెప్పిన వారికి చౌకదుకాణం ఇవ్వ లేదని ఇటీవల దీపాలదిన్నెపాలెం సర్పంచ్ రాజీనామా చేస్తున్నప్పట్లు ఆమె భర్త రాజీనామా లేఖను ఎంపీడీవో కార్యాలయ అటెండర్‌కు అందించారు. ఇలా కూటమినేతల దాష్టికంతో వచ్చిపడిన ఈ ఉపద్రవానికి ఉన్న ఉద్యోగాలను కోల్పోయిన చిరుద్యోగులు కుటుంబాలు గడవక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు



నేను నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ చేస్తున్నా. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత నన్ను విధుల్లోంచి తొలగించమని రాజకీయ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు మండల విద్యాశాఖ అధికారి లెటర్ ఇవ్వమంటున్నారని ఒత్తిడి తీసుకొస్తున్నారు. నేను న్యాయబద్ధంగా పని చేస్తున్నా.

-చాగంటి లక్ష్మి,
మధ్యాహ్నం ఏజెన్సీ నిర్వాహకురాలు, నందిగామ

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు తగదు



స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరిగాయి. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి. సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తున్న చాగంటి లక్ష్మిని విధుల నుంచి తప్పించమని రాజకీయ నాయకులు డిమాండ్ చేయడం సరైనది కాదు. కనీసం భర్త కూడా లేని ఆమె ఎలా జీవనం సాగించగలదు. వేధింపులు మానుకోక పోతే ఆందోళన ఉధృతం చేస్తాం.

-గుంటూరు మల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలు సీఐటీయూ, పల్నాడు

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక



ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి ఏర్పాట్లు వివరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం వన మహోత్సవంలో పాల్గొనేందుకు నరసరావుపేట రానున్నారు. హెలికాప్టర్ ద్వారా జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు 10.30 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.45 గంటలకు కళాశాల గ్రౌండ్‌కు చేరుకొని ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఎగ్జిబిషన్ పరిశీలించి 12.45 గంటల వరకు బహిరంగ సభలో మాట్లాడతారు. 12.55గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి 1.10 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పావుగంట ముందుగా 10.15 నిమిషాలకు జేఎన్‌టీయూ సమీపంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి వన మహోత్సవ ప్రదేశానికి చేరుకొని ముఖ్యమంత్రితో కలిసి వన మహోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.40 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి 1.25గంటలకు మంగళగిరి క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు.

600 మందితో బందోబస్తు

ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని 600 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సీఎం, ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠితో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తన అనుచర గణంతో కలిసి పరిశీలించారు. ఎస్పీని కలిసి వివరాలు తెలుసుకున్నారు.

ఆర్భాటాలకు దూరంగా సీఎం సభ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు హంగు, ఆర్భాటాలు లేకుండా జిల్లాలో ముఖ్యమంత్రి బహిరంగ సభకు ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. జేఎన్‌టీయూలో శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేవలం ఐదారు వేలలోపు స్థానిక ప్రజానీకం మధ్య వనమహోత్సవం సీఎం ప్రారంభిస్తారన్నారన్నారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మత్తు.. బతుకే చిత్తు



బైక్‌పై స్టంట్ చేసుకుంటూ వెళ్తున్న యువకుడు



బైక్‌పై నలుగురు వెళుతున్న దృశ్యం

యువత సెల్ఫీ మోజులు, ఇన్‌స్ట్రాగామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలలో లైక్‌లు, షేర్స్ కోసం ప్రాణాలను పణంగా పెట్టేస్తున్నారు. బుధవారం రాత్రి ఓ యువకుడు స్నేహితుల ద్వారా వీడియో రికార్డు చేయించుకుంటూ.. ముందు బైక్‌పై స్టంట్‌లు చేసుకుంటూ దాచేపల్లి పట్టణం వరకు వెళ్లాడు. పిడుగురాళ్ల పట్టణంలోని ఒక బైక్‌పై నలుగురు, ఐదుగురు కూడా ఎక్కి ప్రయాణం చేయటం, అంతేకాకుండా కొంతమంది యువకులు గంజాయి, మద్యం తాగి బైక్‌లపై పట్టణంలోని మెయిన్ రోడ్డు, వీధుల్లో తిరుగుతూ బాలికలపై అసభ్యకరంగా ప్రవరిస్తున్నారు. సోషల్ మీడియాలో పేర్ల కోసం ప్రాణాలను పణంగా పెట్టడం సరైనది కాదని పట్టణ ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా మరి కొంత మంది మైనర్లు బైక్‌పై సంచరిస్తూ మార్కెట్ యార్డు వరకు వెళ్లటం, అక్కడ నుంచి కింద సెంటర్ తహసీల్దార్ కార్యాలయం వరకు తిరుగుతూ వచ్చిపోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి వారిపై చర్య తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– పిడుగురాళ్ల

శిక్షలు కఠినంగా అమలు చేయాలి



కోల్‌కత్తా మెడికల్ కళాశాలలో విధి నిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నేరస్తులు తప్పించుకోకూడదు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేసి కఠిన శిక్షలు అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్‌లో ఇటువంటి ఘోరాలు జరగకుండా ఉంటాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో పోలీసుల రక్షణతోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఎల్లప్పుడూ ఉండాలి. ఐఎంఏ బాధ్యత తీసుకొని ప్రభుత్వాలు అమలుచేసేలా పోరాటం చేయాలి.
–డాక్టర్ కె.వసంతరాయ, గైనకాలజిస్టు, నరసరావుపేట



పోలీసులు, సీసీ కెమెరాలు తప్పనిసరి చేయాలి



కోల్‌కతా సంఘటన మరోసారి జరగకూడదు. ఇది చాలా బాధాకరం. ప్రభుత్వ హాస్పిటళ్ళ, మెడికల్ కళాశాలలో తప్పనిసరిగా వైద్యులకు తగిన రక్షణ ఏర్పాట్లు ఉండాలి. ముఖ్యంగా మహిళలకు చాలా అవసరం. పోలీసుల పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘా ఎంతో అవసరం. ఈ సంఘటనలకు పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తేనే మరోసారి జరగకుండా ఉంటాయి.
--డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, నరసరావుపేట

క్లుప్తంగా

గుర్తు తెలియని ద్విచక్ర వాహనం దగ్ధం



రెంటచింతల: రెంటచింతలలో ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన బుధవారం అర్ధ రాత్రి జరిగింది. గ్రామంలోని లూర్దు మాత మందిరం సమీపంలో రాత్రి 12 గంటల తర్వాత గుర్తు తెలియని ద్విచక్రవాహనం దగ్ధం అవుతుండగా గమనించి చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకున్నారు. అయితే అక్కడ ఎవరూ లేకపోవడం గమనార్హం. ఆ ద్విచక్రవాహనం పక్కనే మండవ రామారావుకు చెందిన కారుపై కప్పిన పట్టకు కూడా నిప్పు అంటుకోవడంతో వెంటనే నీళ్లు పోసి మంటలు అదుపులోకి తెచ్చారు. ద్విచక్రవాహనం ఎవరిదో ఇప్పటి వరకు తెలియలేదు. దీంతో ఆరుబయట ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసే వాహన చోదకులు ఆందోళనకు గురౌతున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. గతంలోనూ గ్రామంలో ఉట్ల స్తంభాల సెంటర్లో, గ్రామ పంచాయతీ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమైన విషయం విదితమే.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



దాచేపల్లి: నడికుడి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేస్టేషన్‌లోని 3వ నెంబర్ ప్లాట్‌ఫారం పక్కన ఉన్న పట్టాలపై సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి తలపెట్టి పడుకున్నాడు. గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళుతున్న రైలు పట్టాలపై పడుకున్న వ్యక్తిపై నుంచి వెళ్లింది. శరీరం నుంచి తల విడిపోయింది. ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులు ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లే వ్యక్తిని గమనించే క్షణాల్లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలన చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు వెల్లడించారు.

గుంటూరు రేంజ్‌లో ఐదుగురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల జిల్లా డీటీసీ సీఐ సీహెచ్.సింగయ్యను గుంటూరు జిల్లా పశ్చిమ ట్రాఫిక్ పీఎస్‌కు, ఏసీబీ సీఐ బి.రవీంద్రబాబును గుంటూరు జిల్లా ఫిరంగిపురం పీఎస్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.భాస్కర్‌ను గురజాల పీఎస్‌కు, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్ట్ సర్కిల్ సీఐ కె.వెంకటరెడ్డిని ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా దక్షిణ ట్రాఫిక్ పీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న కె.రామకృష్ణను ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా ఉత్తర ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాను, శ్రీనివాసరావు



రామకృష్ణాపురంలోని బాలికల గురుకులంలో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ బృందం

సత్తెనపల్లి: గురుకుల పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాను, ఉమ్మడి గుంటూరు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బందెల శ్రీనివాసరావు కోరారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను వారు గురువారం సందర్శించారు. శిథిలావస్థకు చేరుకున్న ఉపాధ్యాయుల క్వార్టర్స్, పాఠశాల భవనాలలో కోతులు గుంపులు గుంపులుగా చేరి విద్యార్థులపై దాడి చేస్తున్నాయన్నారు. వాటిని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థినిలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏ సెక్షన్, బీ సెక్షన్‌కు మాత్రమే అనుమతులు ఉన్నాయని, ఒక్కో సెక్షన్‌లో 40 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. అదనంగా సీ సెక్షన్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాలను స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యాసారపు బాబు, డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వేల్పుల అఖిల్ తదితరులు ఉన్నారు.

సెప్టెంబర్ 26, 27 తేదీల్లో ఏఐకేఎఫ్ సభలు

కరపత్రాలు ఆవిష్కరించిన నాయకులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: ఉమ్మడి గుంటూరు జిల్లా అఖిలభారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) ప్రథమ మహాసభలు రెండు రోజులపాటు సెప్టెంబరు 26, 27 తేదీలలో నరసరావుపేటలో జరుగుతాయని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాషా చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఈ మహాసభలకు చెందిన కరపత్రాలను కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభల్లో సుమారు 200 మంది రైతు ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అనేకమైన రైతు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వరికెపుడిశెల ప్రాజెక్టును ఎన్నికల వాగ్దానంగా పాలక పార్టీలు ఉపయోగించుకొని అధికారంలోనికి వచ్చిన తర్వాత గాలికి వదిలేస్తున్నాయని అన్నారు. స్మార్ట్ మీటర్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిపాదన చేసినప్పుడు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ మీటర్లను బద్దలు కొట్టండి ఏమన్నా ఉంటే అధికారంలోకి వచ్చేది మేమేకాబట్టి చూసుకుంటామని చెప్పారని అన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వీరు కూడా స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీనిని రైతులు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అన్నారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు అగ్రహారం భూములు సుమారు నాలుగువేల ఎకరాలు రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని, వారికి సర్వే చేసి పట్టాలు ఇవ్వవలసిన అవసరం ఉందని అన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని కోరారు. మహాసభలో వీటిపై చర్చించి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రైతు సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్. మస్తాన్వలి షేక్.వై రబ్బాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేటి క్రీడాకారులుగా ఎదగాలి

గుంటూరు జిల్లా డీఈఓ పి.శైలజ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడలపై ఆసక్తితో మేటి క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత విద్యా సంవత్సరంలో క్రీడల్లో ఎక్కువ మందిని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఆడించి, జిల్లాస్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన ఐదు పాఠశాలలకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా నారాకోడూరు, నూతక్కి, ఉప్పలపాడు, కొర్రపాడు, మందపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గత కొన్నేళ్లుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో క్రీడా ప్రతిభా పురస్కారాల్ని అందజేస్తోందన్నారు. ఇందులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఐదు పాఠశాలలకు ప్రదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎం.రవి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, ఆర్ఐపీఈ బాషా, సంఘ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశ్వరరావు, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

8న మిస్టర్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫిట్‌నెస్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 8న మిస్టర్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు, రాష్ట్రస్థాయి కెటిల్‌బెల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని అసోయేషన్ అధ్యక్షులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం పోటీలు జరిగే స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆవిష్కరించారు. ప్రతి అసోసియేషన్ విధిగా క్రీడా పోటీలు నిర్వహించాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో నాగ గౌతమ్, ఎండీ జావెద్ అహ్మద్, డాక్టర్ సతీష్, రాజ్ కుమార్, అభిషేక్ పాల్గొన్నారు.

చెంచు, గిరిజనుల జీవితాలలో వెలుగులు



దావుపల్లి తండాలో చెంచు, గిరిజనులతో ఐటీడీఏ స్పెషలాఫీసర్ ధనుంజయ

వెల్దుర్తి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెంచు, గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపేందుకు పీఎం జన్‌మన్ పథకాన్ని తీసుకొచ్చారన్నారని ఐటీడీఏ స్పెషలాఫీసర్ ధనుంజయ, సూపరింటెండెంట్ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని దావుపల్లి, శిలువకొండ, కుంకుడు చెట్టు తండా, గుడిపాటి చెరువు గ్రామాల్లో జరిగిన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచుల జీవితాలను మెరుగుపర్చేందుకు అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చాయన్నారు. చెంచు గూడెంలలో కావాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభల్లో చర్చించి వారికి కావాల్సిన పథకాలను గుర్తించి మంజూరు చేయించి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. చెంచు గిరిజనులు వారి తండాలకు కావాల్సిన మౌలిక వసతుల సదుపాయాలను అర్జీల రూపంలో అందించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మకట్‌లాల్, వీఆర్వో నరేంద్రరెడ్డి, చెంచు, గిరిజనులు పాల్గొన్నారు.

నూతన శాఖ ప్రారంభించిన సీజీజీబీ



నకరికల్లులో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి పక్కన ఆర్ఎం పి.శ్రీనివాస్

నకరికల్లు: రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 271 శాఖలతో రూ.23వేల కోట్ల లావాదేవీలతో చిన్న, సన్నకారు రైతులు, చిరువ్యాపారులతో పాటు అన్ని వర్గాల వారికి అండగా నిలిచే విధంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు పనిచేస్తుందని చైతన్య గోదావరి బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో నూతన శాఖ ప్రారంభించడంతోపాటు, నకరికల్లులో ఆధునిక హంగులతో కూడిన నూతన భవనంలోకి మార్చిన శాఖను ఆయన గురువారం ప్రారంభించారు. ఖాతాదారులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటుచేసి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా అందజేస్తున్న సేవలను వివరించారు. పల్నాడు జిల్లాలో 71 శాఖలతో రూ.7వేల కోట్ల లావాదేవీలతో ఖాతాదారులకు చేరువైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి విస్తృత సేవలు అందించేందుకు మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో నూతన శాఖను ప్రారంభించామని అన్నారు. కార్యక్రమంలో నకరికల్లు, రూపెనగుంట్ల శాఖల మేనేజర్‌లు కోడె రామ్ సాయిచంద్, దుర్గాప్రసాద్, డివిజన్‌లోని పలుశాఖల మేనేజర్‌లు, రైతులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కృష్ణా, పశ్చిమగోదావరి మ్యాచ్



దీపక్‌చంద్,4 వికెట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్–23 క్రికెట్ పోటీల్లో భాగంగా కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య మ్యాచ్ రసవత్తరంగా మారింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ ఐదు వికెట్లు నష్టానికి 266 పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించి 331 పరుగులకు ఆలౌట్ అయింది. కృష్ణా బ్యాట్స్‌మెన్‌లు సుశాంత్‌నాయుడు 86, అనంత్‌కార్తికేయ 61, శ్రీనిశ్వయ్ 59 పరుగులు సాధించారు. పశ్చిమగోదావరి బౌలర్లు దీపక్‌చంద్ 4, పి.భువనేశ్వర్ 3 వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్లు నష్టానికి 172 పరుగులు చేసింది. జట్టులోని హరిష్ 57 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్లు సుశాంత్‌నాయుడు, ఆదర్శ్ చెరో రెండు వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్. సీతాపతిరావు పర్యవేక్షించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు జిల్లా స్విమ్మర్లు



స్విమ్మర్లను అభినందిస్తున్న సుబ్బారెడ్డి

నరసరావుపేటఈస్ట్: జాతీయస్థాయి ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి ఇద్దరు స్విమ్మర్లు ఎంపికై నట్టు పల్నాడు జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 25వ తేదీన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 10వ సీనియర్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనపరిచిన ఎస్. జగదీష్ (స్విమ్మింగ్), ఎస్.మానసకుమార్ (వాటర్ పోలో) పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. కర్నాటక రాష్ట్రం మంగుళూరులో సెప్టెంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలో జగదీష్ స్విమ్మింగ్ పోటీలోనూ, కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో సెప్టెంబర్ 18 నుంచి 22వ తేది వరకు జరగనున్న జాతీయస్థాయి వాటర్ పోలో పోటీలో మానసకుమార్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కోచ్ జి.సురేష్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్

ఏఎన్‌యూలో అధికారులకు ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘ నాయులు



ఇన్‌చార్జి వీసీకి ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్ నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ బి. శేఖర్‌బాబును ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు అడ్డుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఎగ్జామ్‌ను షెడ్యూల్ ప్రకారం గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరపాలి. సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్దేశించిన షెడ్యూల్ కంటే ముందు ఉదయం 10 గంటలకే నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సమాచారం తెలుసుకున్నారు. ఈ విషయంపై డిపార్టుమెంట్ కోఆర్డినేటర్‌ను వివరణ కోరగా విద్యార్థి రిక్వెస్ట్ చేయడంతో షెడ్యూల్ కంటే ముందే జరపాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. ఎగ్జామ్ రాస్తున్న విద్యార్థిని అడుగ్గా తాను అడగలేదని తెలిపాడు. నాయకులు విషయాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి తీసుకుని వెళ్లగా, ఆయన రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయమని సూచించారు. నాయకులు విషయాన్ని ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్, రెక్టార్, రిజిస్ట్రార్‌ల వద్దకు తీసుకుని వెళ్లి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై యూనివర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో సమస్యలు ఉన్నాయని, ఈ విషయంతోపాటు వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి నాయకులు ఆందోళన విరమించారు. ఎన్‌ఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ రత్నసాగర్, సెక్రటరీ గణేష్, వైస్ ప్రెసిడెంట్ రత్న కిశోర్, ట్రెజరర్ మధు పాల్గొన్నారు.

క్రీడాకారులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

గుంటూరు వెస్ట్ జీవితంలో గెలుపోటములు సహజమనే విధానం క్రీడల్లో చూడగలమని గుంటూరుజిల్లా జేసీ ఎ.భార్గవ్‌తేజ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి స్థానిక బి.ఆర్.స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు జేసీతోపాటు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి బహుమతులు అందజేశారు. నసీర్ అహ్మద్ మాట్లాడుతూ స్టేడియం క్రీడాకారులతో కళకళలాడాలన్నారు. ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించు కుని ప్రతి ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు

తెనాలి రూరల్: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన సోమరౌతు సింధుజయేంద్రప్రసాద్ అలియాస్ సింధురాజ్ అదే గ్రామానికి చెందిన సోమరౌతు సాంబయ్య వద్ద అప్పుడప్పుడూ డబ్బులు తీసుకుంటుండేవాడు. తిరిగి ఇవ్వకపోగా ఇంకా కావాలని అడగడంతో సాంబయ్య ఇచ్చేందుకు నిరాకరించాడు. పొలం నుంచి ఇంటికి వస్తున్న అతడ్ని డబ్బు ఇస్తానని చెప్పి సింధురాజ్ ఇంటికి తీసుకెళ్లి చాకుతో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడు ఇంటి నుంచి బయటకు వచ్చి కొంతదూరంలో పడిపోగా స్థానికులు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్ నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

భాషను సామాన్యుల చెంతకు చేర్చిన గిడుగు


ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్




దయానంద్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు భాష పండితుల నుంచి నుంచి పామరులకు చేరాలనే ఆశయంతో గిడుగు రామ్మూర్తి పంతులు గ్రాంధిక భాషను కాదని వ్యవహారిక భాష కోసం ఉద్యమం చేసి విజయం సాధించారని సుప్రసిద్ధ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దయానంద్ మాట్లాడుతూ గిడుగు సవర జాతికి లిపిని తయారు చేసేందుకు జీవితాన్ని అంకితం చేసి తీవ్ర కష్టనష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. ఆయన కృషిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని తెలుగు భాషను రక్షించుకోవాలని సూచించారు. ప్రముఖ రచయిత కందిమళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నెలకొకటి చొప్పున ఎన్నో వందల పద్యాలను సులువుగా నేర్చుకోవచ్చని తెలిపారు. కళాశాల విద్యా విషయక సమన్వయకర్త డాక్టర్ కె. కాళిదాసు మాట్లాడుతూ తెలుగు ముందుగా నేర్చుకుంటే ఆంగ్లం వంటి పరి భాషలు సులువుగా వంట పడతాయని సూచించారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, అధ్యాపకులు ఆలూరి నటరాజ కుమారి, తపతీ కిరణ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా డిగ్రీ ప్రథమ సెమిస్టర్‌లో తెలుగులో అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థినికి కళాశాల పూర్వ కార్యదర్శి మాజేటి వేంకట రామకోటి ముత్యాలు ప్రకటించిన ఆర్థిక పురస్కారాన్ని అందజేశారు.

తీరంలో సినిమా షూటింగ్ సందడి





చీరాల తీర ప్రాంతంలో జరుగుతున్న సినిమా షూటింగ్ దృశ్యాలు

చీరాల: ప్రముఖ హీరో గోపీచంద్ డైరెక్షన్‌లో మైత్రి మూవీస్ బ్యానర్‌పై హిందీ సినిమా షూటింగ్ జరుగుతోంది. సన్నీడియోల్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో చీరాల, రామాపురం తీర ప్రాంతంలో ఫైటింగ్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ చూసేందుకు వందల మంది తరలిరావడంతో ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ తగిన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం గోపీచంద్ మాట్లాడుతూ.. తాను హిందీ సినిమాను డైరెక్ట్ చేయడం ఆనందంగా ఉందన్నారు. సన్నీడియోల్, పలువురు అగ్రతారలు నటిస్తున్నట్లు తెలిపారు. త్వరలో సినిమా పేరు ప్రకటిస్తామన్నారు.